కర్నూలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):
వైసీపీ హయాంలో హంద్రీ నీవా ప్రాజెక్టులో జరిగిన అక్రమ చెల్లింపులు బయట పడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా రూ.9.38 కోట్లు అక్రమంగా చెల్లించారని అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అభ్యంతరం చెప్పింది. ఆ తరువాత కూడా తుది బిల్లులు చెల్లించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో ఈఎన్‌సీ స్థాయి అధికారి ఒత్తిడితో ఓ ఈఈని సెలవులో పంపించి మరో ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించి తుది బిల్లులు చెల్లించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనిపై పలు అభ్యంతరాలతో అకౌంటెంట్ జనరల్ (ఏజీ) ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ నెల 4న లేఖ రాసింది.



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంలో భాగంగా తవ్విన అప్రోచ్ ఛానల్ (ఫైల్)

నిబంధనలకు నీళ్లు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రాయలసీమ ప్రాణనాడి. శ్రీశైలం ఎగువన కేసీ కాలువ, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం కాలువలకు కృష్ణా జలాలు ఎత్తిపోయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మించారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముచ్చుమర్రి లిఫ్టు నిర్మించి రైతులకు అంకితం చేశారు. కీలకమైన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-1 (సివిల్) కింద సిద్దేశ్వరం నుంచి ముచ్చుమర్రి లిఫ్టు పంప్‌హౌస్ వరకు అప్రోచ్ ఛానల్, ముచ్చుమర్రి లిఫ్ట్ పంప్‌హౌస్ నుంచి హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధాన పంపింగ్ కేంద్రం మల్యాల లిఫ్ట్ అప్రోచ్ ఛానల్‌ను కలుపుతూ లింక్ కెనాల్ తవ్వారు. 2007లో ఈ పనులకు రూ.110.90 కోట్లు మంజూరు చేస్తే.. రివైజ్డ్ ఎస్టిమేషన్ మేరకు రూ.132.56 కోట్లకు హంద్రీనీవా ప్రాజెక్టు అనంతపురం సీఈ సాంకేతిక అనుమతులు ఇచ్చారు. అప్రోచ్ ఛానల్, లింక్ కెనాల్ తవ్వకాల్లో భాగంగా బ్లాస్టింగ్ పనులకు నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించారనే ఆరోపణల బలంగా ఉన్నాయి. బిల్లులు చెల్లింపుల్లో నిబంధనలు పాటించలేదని, అక్రమంగా చెల్లించారంటూ పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏపీ అకౌంటెంట్ జనరల్ ఆడిట్ ఈ నెల 4న ఏజీ ఆడిట్ నందికొట్కూరులోని హంద్రీనీవా ప్రాజెక్టు డివిజన్-1 ఈఈకి లేఖ రాయడం ఇంజనీర్లలో హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ అధికారే ప్రస్తుతం కర్నూలు సర్కిల్ ఎస్ఈగా రావడానికి అధికార టీడీపీ కూటమి ప్రజాప్రతినిధుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఎస్ఈగా వస్తే అక్రమ చెల్లింపుల రికార్డులు మార్చే చేసే ప్రమాదం ఉందని జలవనరుల శాఖలో చర్చ జరుగుతున్నది.

మిగతా 6వ పేజీలో

రూ.9.38 కోట్ల అక్రమ చెల్లింపులు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ ఛానల్, లింక్ కెనాల్ తవ్వకాల్లో రాళ్ల పగలగొట్టేందుకు సాధారణ బ్లాసింగ్‌కు అనుమతులు ఇచ్చారు. అయితే.. పలు గ్రామాల అభ్యంతరాలు దృష్ట్యా కంట్రోల్ బ్లాస్టింగ్‌కు అనుమతి ఇవ్వాలని కాంట్రాక్ట్ సంస్థ కోరింది. రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ), హై-పవర్ కమిటీ అనుమతుల మేరకే కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాలని ఇంజనీర్లు అంటున్నారు. అయితే.. జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీ (డీఎల్ఎస్‌సీ) సిఫారుసు మేరకు కంట్రోల్ బ్లాస్టింగ్‌కు కాంట్రాక్ట్ సంస్థకు 75 శాతం చెల్లించాలని ఈఎన్‌సీ, సీఈలు ఆదేశాలు జారీ చేశారు. దీనిని పార్ట్ పేమెంట్‌గా పరిగణించాల్సి ఉంటుంది. అప్రోచ్ ఛానల్ తవ్వకాల్లో ఎఫ్ అండ్ ఎఫ్ రాక్ ప్రాంతాల్లో కంట్రోల్ బ్లాస్టింగ్‌కు, సాంప్రదాయ బ్లాస్టింగ్ మధ్య ధరల్లో ఉన్న వ్యత్యాసం మేరకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్ట్ సంస్థ కోరగా.. ఎఫ్ అండ్ ఎఫ్ రాక్ కంట్రోల్ బ్లాస్టింగ్ కోసం క్యూబిక్ మీటరుకు రూ.262.04 చెల్లించేందుకు డీఎస్ఎస్‌సీ ఆమోదించింది. అయితే.. తుది ఆమోదం కోసం స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ)కి పంపించాలని హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ సూచించారు. అయితే.. ఎస్ఎల్ఎస్‌సీ ఆమోదం పెండింగ్‌లో ఉండగానే, ఎలాంటి ఆదేశాలు, సూచనలు పాటించకుండా రూ.9.38 కోట్లు అక్రమ చెల్లింపులు జరిగాయని ఏజీ ఆడిట్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

- హంద్రీ నీవా ప్రాజెక్టులో రూ.9.38 కోట్ల అక్రమ చెల్లింపులు
- ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం
- ఆడిట్ అభ్యంతరాలు
- అయినా.. చెల్లించిన తుది బిల్లులు
- హంద్రీ నీవా ప్రాజెక్టు డివిజన్-1 ఈఈకి లేఖ రాసిన అకౌంటెంట్ జనరల్ ఆడిట్

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కారక వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరిస్తున్నారా లేదా ఆయా శాఖల అధికారులు ఆడిట్ చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని ఎట్ టూ వ్యూ ఆప్షన్‌లో అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదని, వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అదే విధంగా రీఓపెన్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

సీఎంవో ఫిర్యాదులకు సంబంధించి పెండింగ్‌లో ఉండకూడదని, వేగవంతంగా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ కర్నూలు, పత్తికొండ,ఆర్డీవోలను ఆదేశించారు. పుచ్చకాయలమడ గ్రామ సభలో వచ్చిన అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలన్నారు. అక్టోబరు 1వ తేదీన పుచ్చకాయలమడ గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించిన సందర్భంగా వచ్చిన 176 అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూకి సంబంధించి 58, హౌసింగ్‌కు 45, డీఆర్‌డీఏ 28, విద్యాశాఖ 5, వైద్యశాఖ 5, సివిల్ సప్లయిస్ 5, వ్యవసాయ శాఖ 2, డ్వామా 4, పశుసంవర్ధక శాఖ 4, ఎల్‌డీఎం 1, సాంఘిక సంక్షేమ శాఖ 1, పంచాయతీరాజ్ 6, ఆర్‌అండ్‌బీ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 2, డీపీవో 1, దేవాదాయ శాఖ 1, ఐఅండ్‌పీఆర్ 1 దరఖాస్తులు వచ్చాయని అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నంద్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :
కూటమి సర్కారులోనూ వైసీపీ హవా నడుస్తోందా..? కొన్ని వ్యవహారాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు గుట్టుగా ఆ పార్టీకి సహకరిస్తున్నారా..? పాత పరిచయాలతో పనులు చక్కబెట్టుకుంటున్నారా.. ? విజయ డెయిరీ పాలకవర్గ వ్యవహారాలు అవుననే అనిపిస్తున్నాయి.



పాలలో నీళ్లలా...!

రైతుల ఆర్థిక చేయూత కోసం విజయ డెయిరీ ఏర్పాటైంది. 15 మంది డైరెక్టర్లతో కూడిన ఓ చైర్మన్ పాలకవర్గం ఏర్పడి డెయిరీని నడిపిస్తుంటారు. అయితే గత కొన్నేళ్లుగా విజయ డెయిరీ చుట్టూ రాజకీయం నడుస్తోంది. ప్రభుత్వం మారినప్పుడల్లా పదవుల కోసం డైరెక్టర్లు, చైర్మన్‌ను మార్చడం సర్వసాధారణమైపోయింది. ఈ సారి మాత్రం అలా జరగకుండా ప్రస్తుత చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. అయితే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోదరుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి మాత్రం గత వైసీపీ సర్కార్‌లో చైర్మన్‌గా ఎన్నికైన ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డిని పదవీచ్యుతుడిని చేసి ఆ కుర్చీని దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే చక్రవర్తుల పల్లె సొసైటీ నుంచి డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసుకున్నారు. దీంతో తన కుర్చీకి ఎసరు వస్తుందని తెలుసుకున్న చైర్మన్ జాగ్రత్త పడ్డారు. భూమా గతంలో డెయిరీలో రుణం తీసుకొని చెల్లించలేదని డిఫాల్టర్‌గా చూపించి డైరెక్టర్ పదవిని రద్దు చేయించారు. ఆ విధంగా అధికార పార్టీ నుంచి తన చైర్మన్ పదవికి ఢోకా లేకుండా చేసుకున్నారు. ఇందులో భాగంగానే ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ స్థానాలకు హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చి తన అనుకూలరను నియమించుకునేందుకు నామినేషన్ పక్రియను చకచకా చేపట్టాలని చూశారు. భూమా వర్గీయులు ఆందోళన చేయడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది.

ఆ ముగ్గురితో మంతనాలు..

విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి పెద్దనాన్న ఎస్వీ సుబ్బారెడ్డి గతంలో టీడీపీలో మంత్రిగా పని చేశారు. ఈయన కుమారుడు ప్రస్తుతం కర్నూలు జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన మంత్రి, ఎస్వీ సుబ్బారెడ్డి గతంలో టీడీపీ మంత్రి వర్గంలో కలిసి పని చేశారు. వీరి ద్వారానే చైర్మన్ పీఠం పోకుండా జగన్మోహన్‌రెడ్డి లోగుట్టు వ్యవహారం నడిపినట్లు సమాచారం. ఇదే క్రమంలో అధికారి పార్టీకి చెందిన మరో ప్రజాప్రతినిధికి ఎస్వీ మోహన్‌రెడ్డి మంచి స్నేహితుడని తెలుస్తోంది. ఆయన ద్వారా కూడా చైర్మన్ పదవి మార్పునకు అవకాశం లేకుండా చేసుకున్నారని స్పష్టమవుతోంది.

వ్యూహాత్మకంగా పైరవీలు..

ప్రభుత్వం మారినా వైసీపీకి చెందిన ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి విజయ డెయిరీ చైర్మన్‌గా కొనసాగుతుండడం వెనకాల పెద్ద రాజకీయ వ్యూహమే ఉందని తెలుస్తోంది. నంద్యాల జిల్లాలోని ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడం కూడా ఆయనకు కలిసి వచ్చిన అంశంగా చెప్పవచ్చు. భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు, కొందరు ప్రజాప్రతినిధులకు సరిపోవడం లేదని తెలుస్తోంది. ఇదే అదనుగా భావించిన సదరు డెయిరీ చైర్మన్ వ్యూహాత్మకంగా పావులు కదిపి తన పదవికి అడ్డు లేకుండా చేసుకున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు ముఖ్యంగా ముగ్గురు కీలక ప్రజా ప్రతినిధులు సహకరించినట్లు సమాచారం.

- 'కూటమి'గా ఒక్కటయ్యారు..
- నంద్యాల విజయ డెయిరీలో రాజకీయం
- ప్రస్తుత చైర్మన్ వ్యూహాత్మకంగా అడుగులు
- కలిసి వచ్చిన పాత పరిచయాలు
- ముగ్గురు ప్రజాప్రతినిధులతో మంతనాలు
- పదవి పోకుండా ప్రయత్నాలు
- భూమాకు 'అధికార' సహాయ నిరాకరణ



ఇటీవల సీఎంను కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ (ఫైల్)

డైరెక్టర్లకు కాసుల ఎర..

ప్రభుత్వాలు మారినప్పుడల్లా అధిష్ఠానం తమ అనుయాయులకు డెయిరీ చైర్మన్ పదవిని అప్పగిస్తోంది. డెయిరీలోని 15 మంది డైరెక్టర్లు, చైర్మన్ పదవి కోరుకునే వ్యక్తి కలిసి అధిష్టానంతో చర్చించి చైర్మన్ పీఠం దక్కించుకోవడం సాధారణంగా జరిగే ప్రక్రియ. ఇందుకు కాసుల ఎర చూపాల్సిందే. ప్రస్తుత డెయిరీ చైర్మన్ కూడా గత వైసీపీ సర్కార్‌లో ఇదే తరహాలో పదవి దక్కించుకున్నారని సమాచారం. కూటమి సర్కారు డెయిరీ చైర్మన్ పదవిపై దృష్టి సారించకున్నా భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి మాత్రం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నలుగురు డైరెక్టర్లు భూమా వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ మిగిలిన వారంతా ప్రస్తుత చైర్మన్ వైపు ఉన్నారని తెలుస్తోంది. డైరెక్టర్లు తమ వైపు ఉండేందుకు ప్రస్తుత చైర్మన్ పెద్దఎత్తున కాసుల ఎర చూపారని సమాచారం. అంతేగాకుండా అధికార పార్టీకి చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులతోనూ తమదైన శైలిలో సదరు డైరెక్టర్లకు హెచ్చరికలు కూడా జారీ చేయించినట్లు చర్చ సాగుతోంది.

మిగతా 6వ పేజీలో

వాము ధర అదరహో..

- విక్రయానికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వాము
- క్వింటం గరిష్ఠ ధర రూ.21,062



కర్ణాటక నుంచి విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు విక్రయానికి కర్నూలు మార్కెట్ యార్డుకు వామును తీసుకురావడం మొదలైంది. ఔషధాల తయారీలో ఎక్కువగా వామును ఉపయోగిస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డు నుంచి వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన వామును గుజరాత్‌కు పెద్ద ఎత్తున తరలిస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 42 క్వింటాళ్ల వామును విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ఠ ధర రూ.21,062, మధ్యస్థ ధర రూ.17,688, కనిష్ఠ ధర రూ.15,680లకు అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా కందులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఏకంగా 4,665 క్వింటాళ్లను రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ఠ ధర మద్దతు ధరకు మించి రైతుకు దక్కింది. గరిష్ఠ ధర రూ.7,889లు, మధ్యస్థ ధర రూ.6,971, కనిష్ఠ ధర రూ.1,500లు అందిందని సెక్రటరీ తెలిపారు. శనగలు ఇప్పుడిప్పుడే కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి రావడం మొదలైంది. గరిష్ఠ ధర రూ.6,176లు, మధ్యస్థ ధర రూ.6,971లు, కనిష్ఠ ధర రూ.1,500లకు అమ్ముడుపోయింది. శనగలకు గరిష్ఠ ధర రూ.6,176లు, మధ్యస్థ ధర రూ.5,811లు, కనిష్ఠ ధర రూ.5,029లు రైతుకు దక్కింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,529లు, మధ్యస్థ ధర రూ.2,237, కనిష్ఠ ధర రూ.817లు నిర్ణయించారు. ఎండుమిరపకాయలకు గరిష్ఠ ధర రూ.14,513లు, మధ్యస్థ ధర రూ.13,729లు, కనిష్ఠ ధర రూ.2,333లు రైతులకు అందింది. సజ్జలు గరిష్ఠ ధర రూ2,311లు, మధ్యస్థ ధర రూ.2,311లు, కనిష్ఠ ధర రూ.2,185 పలికింది. మొక్కజొన్నలకు మద్దతు ధరకు మించి ధర చేతికందడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గరిష్ఠ ధర రూ.2,399లు, మధ్యస్థ ధర రూ.2,370లు, కనిష్ఠ ధర రూ.2,104లు వ్యాపారులు నిర్ణయించారు.

కూచిపూడిలో మేటీ



ఢిల్లీ ప్రదర్శనలో నాగరాజు బృందం

కూచిపూడి నేర్చుకోవాలన్నదే ఆ యువకుడి కోరిక. పేద కుటుంబం కావడంతో ఎనుకున్న లక్ష్యం కోసం ఓ రెస్టారెంట్, బుక్ షాపుల్లో పని చేసి వచ్చిన డబ్బుతో శిక్షణ తీసుకున్నాడు. రోజు రెండు గంటల సమయం నృత్యంలో శిక్షణపొంది అద్భుతంగా రాణించాడు. జాతీయ స్థాయిలో కూచిపూడిపై అవగాహన పెంచుకొని ఎన్నో పతకాలు సాధించి పలువురి ప్రశంసలు పొందుతూ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తంగరడోణ గ్రామానికి చెందిన నాగరాజు 1987 మార్చిలో జన్మించాడు. పోస్టుగ్రాడ్యుయేషన్, కూచిపూడిలో డిప్లోమా పూర్తి చేశారు. పెద్దయ్య, లక్ష్మమ్మలకు తొమ్మిది మంది సంతానం కాగా నాగరాజు 6వ సంతానం. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. తండ్రి కూడా స్టేజి డ్రామా ఆర్టిస్ట్ కావడంతో నాగరాజుకు నృత్య ప్రదర్శనలపై ఆసక్తి పెరిగింది. నాగరాజుకు ఆరేళ్ల వయస్సులో తండ్రి చనిపోవడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఒక వైపు చదువు కొనసాగిస్తూ మరో వైపు నృత్యం నేర్చుకోవాలనే లక్ష్యం అతడిలో పట్టుదలను పెంచింది. అందుకు అనుగుణంగా అనంతపురానికి వెళ్లి అక్కడ ఓ రెస్టారెంట్‌లో నెలకు రూ.4 వేలకు పని చేస్తూ చదువుకు, నృత్య శిక్షణకు వెచ్చిస్తూ లక్ష్యం వైపు కొనసాగారు. రెండేళ్ల పాటు పట్నం శివప్రసాద్ చెంత శిక్షణ తీసుకున్నారు. కొన్ని సంవత్సరాలు సాధన చేసి ఎన్నో ప్రదర్శనలిచ్చారు. కూచిపూడిలో ఢిల్లీ స్థాయిలో 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ఎన్నో ప్రదర్శనలు... అవార్డులు

- 2015లో ఢిల్లీలో జరిగిన జాతీయ నాట్య ప్రదర్శనలో సాధన బాల మేళాలో శబ్దం కూచిపూడి నృత్య ప్రదర్శనకుగాను పురస్కారం.
- 2016లో హైదరబాద్‌లో రవింద్రభారతిలో ప్రదర్శన చేసి ప్రశంసా పత్రం అందుకున్నారు. అదే సంవత్సరంలో చెన్నై, బెంగళూరులో ప్రదర్శనలు చేశారు.
- 2018లో విజయవాడలో నిర్వహించిన 'తెలుగుతేజం' 6,117 మంది ఒకే భంగిమ నాట్య ప్రదర్శనతో గిన్నీస్ బుక్ పురస్కారం అందుకున్నారు.
- 2019లో లేపాక్షి ఉత్సవాల్లో ప్రథమ స్థానం నిలిచారు.

- 2015 లో హంపీలో శివనంది అవార్డు
- రాజమహేంద్రవరంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- కడపలో నాట్య చోళమణి అవార్డు
- బళ్లారిలో నాట్యశిరోమణి అవార్డు
- 2022 మంత్రాలయం పిఠాధిపతి చేతుల మీదుగా నాట్య సంకల్ప అవార్డు పొందారు.

సాధించాలనే తపనతోనే.



కూచిపూడి నృత్య ప్రదర్శనే లక్ష్యంగా మా గురువులు నేర్పిన విద్యతో ఇలా ఉన్నాను. రోజు గంటల తరబడి సాధన చేస్తూ విద్యను అభ్యసించాను. కూచిపూడి వల్ల మానసిక ఉల్లాసం ఒత్తిడిని కూడా జయించవచ్చు. నేడు కూచిపూడి డ్యాన్స్ మాస్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నా. ఎన్నో ప్రదర్శనల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు నేర్పించాను. వీరితో వివిధ జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తున్నాం.

\- నాగరాజు

అద్భుత ప్రదర్శనలు ఇస్తున్న నాగరాజు



విజయవాడ ప్రదర్శనలో తన గురువు కేవీ భార్గవ్ కుమార్‌తో నాగరాజు

ఆశాజనకంగా మామిడి పూత

ఉద్యానవన శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం మామిడి పంట సాగు ఆశాజనకంగా ఉంటుందని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి తెలుస్తోందని జిల్లా ఉద్యాన శాఖ అదికారి రామాంజనేయులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,554 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉందని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారడం వల్ల మామిడి పూత చెట్టుకు 80 నుంచి 90 శాతం వరకు కల్పిస్తోందని ఓ ప్రకటనలో తెలిపారు. తుగ్గలి మండలంలో ఉన్న మామిడి తోటలను ఇటీవల సందర్శించామని, మామిడి రైతులు పూత వచ్చిన తర్వాత మొక్కలు, చెట్లకు అవసరమైన ఎరువులను వేసి తేలికపాటి నీటి తడులు ఇవ్వాలని రైతులకు సూచించారు. ఇంకా పూతకు రాని తోటలు ఏమైనా ఉంటే 13-0-45 ఎరువును 10 గ్రాములు, సల్ఫర్ 3 గ్రాములు మరియు మనోప్రోటోపాస్ 1.6 ఎంఎల్ పరిమాణాన్ని ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలని, అదే విధంగా పూత వచ్చిన రైతులు చీడపీడల యాజమాన్యంలో భాగంగా ముందస్తుగా సాఫ్-2 జీఎం+క్లోరోఫైరీపాస్ 2 ఎంఎల్+బోరాన్ 1 గ్రాము మిశ్రమాన్ని లీటరు నీటికి, అదే విధంగా పచ్చి పూత ఉన్నట్లయితే.. ఇమిడాఫ్లోప్రిడ్ 0.3 ఎంఎల్ +ఎగ్జాకానజోల్ 1 ఎంఎల్ మిశ్రమాన్ని ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు.

పదో రోజు 248 మంది ఎంపిక



పరుగు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

కర్నూలు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు సోమవారం 10వ రోజు కొనసాగాయి. కర్నూలు నగరంలోని ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి.బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 362 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, చాతి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 283 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 151 మంది అర్హత సాధించారు. లాంగ్ జంప్‌లో 238 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 10వ రోజు 248 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఎస్పీగా విక్రాంత్ పాటిల్



కొత్త ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా కర్నూలు ఎస్పీ జి.బిందుమాధవ్‌ను కాకినాడ జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. అక్కడ ఎస్పీగా ఉన్న విక్రాంత్ పాటిల్‌ను కర్నూలుకు బదిలీ చేసింది. ఎస్పీగా ఉన్న బిందుమాధవ్ గతేడాది జూలై 16న కర్నూలు ఎస్పీగా నియమితులయ్యారు. ఆరు నెలల నాలుగు రోజులకే ఆయనను బదిలీ చేయడం గమనార్హం.

కొత్త ఎస్పీ గురించి

2012 బ్యాచ్‌కు చెందిన విక్రాంత్ పాటిల్ తమిళనాడు క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఏపీలో విజయనగరం అడిషినల్ ఎస్పీ (ఆపరేషన్స్)గా పని చేశారు. చిత్తూరు, రైల్వే ఎస్పీగా, ఆ తర్వాత విజయవాడ డీసీపీగా, విజయనగరం 5వ బెటాలియన్ కమాండెంట్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా, కాకినాడ ఎస్పీగా పని చేశారు.

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపిక

కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపికను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రస్తుతం కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్నారు. ఈమె గతంలో కర్నూలు అడిషినల్ ఎస్పీగా పని చేశారు.

ఆరు నెలలకే ఎస్పీ బిందుమాధవ్ బదిలీ



ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక

కొత్త ఎస్పీ, కమాండెంట్లు ఇరువురు భార్యాభర్తలు

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, బెటాలియన్ కమాండెంట్ దీపికలు ఇద్దరూ భార్యాభర్తలు. వీరిద్దరు ఎక్కడ పని చేసినా కూడా ఒకే జిల్లాలో పని చేస్తూ వచ్చారు.

డిప్లొమా ఫార్మసీలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫార్మసీ విభాగంలో డిప్లొమా సీట్లకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎం. వీఎస్ఎస్ఎన్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. బాల బాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి ఉందన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు అన్ని ధృవపత్రాలతో దరఖాస్తులను తప్పకుండా సమర్పించాలన్నారు. పదో తరగతి, ఇంటర్ మార్క్స్ మెమో పత్రాలు, టీసీ, స్టడీ, నేటివిటీ, కులం, అర్హత గల ఈడబ్ల్యూఎస్, పాస్ పోర్టు కలర్ ఫొటోలతో పాటు ఆధార్‌కార్డు సమర్పించాలన్నారు. కె. రామకృష్ణయ్య 8074232785, డా.హెచ్‌ఎం సుధీర్ కుమార్ 9963541557, జి.ధనలక్ష్మి 7207623485, సి.వెంకటేశ్వర్లు 9494138227లను సంప్రదించాలన్నారు.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లును భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీ,ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

నిబంధనలకు నీళ్లు



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్ట్ సంస్థకు తుది (ఫైనల్) బిల్లులు చెల్లింపులోనూ నిబంధనలు, ధరల సర్దుబాటు విధానం పాటించలేదని ఏజీ ఆడిట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏజీ ఆడిట్‌కు అందించిన రికార్డులు ప్రకారం ఫైనల్ బిల్లును సిద్ధం చేసినప్పుడు, లేదా కాంట్రాక్టర్ సంబంధిత పనిని ముందే ముగించేటప్పుడు (ప్రీక్లోజర్) నిబంధనలు పాటించలేదని ఏజీ ఆడిట్ తేల్చి చెప్పింది. అయితే.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు చేసిన కాంట్రాక్ట్ సంస్థ ప్రీక్లోజర్‌కు దరఖాస్తు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో తనకు తుది బిల్లు చెల్లించాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారని ఇంజనీర్లు తెలిపారు. ఫైనల్ బిల్లు చెల్లించేందుకు ఆ సమయంలో పని చేస్తున్న హంద్రీ నీవా ప్రాజెక్టు నందికొట్కూరు డివిజన్-1 ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీ ప్రభుత్వంలో జనవనరుల శాఖలో పని చేసే ఈఎన్‌సీ స్థాయి అధికారి ఒకరి తీవ్ర ఒత్తిడి మేరకు ఆ ఈఈ సెలవుపై పంపించి.. ఆ స్థానంలో కర్నూలులో పని చేస్తున్న మరో ఈఈకి అదనపు బాధ్యతలు (ఇన్‌చార్జి) ఇచ్చి ఆఘమేఘాలపై ఫైనల్ బిల్లు చెల్లించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. విజయవాడ నుంచి పలు అభ్యంతరాలతో ఏజీ ఆడిట్ లేఖ రాయడంతో హంద్రీ నీవా ఇంజనీర్లలో కలకలం మొదలైంది. ఈ విషయాన్ని హంద్రీ నీవా ప్రాజెక్టు సీఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా చేసిన పనులపై ఏజీ ఆడిట్ జరిగిన మాట నిజమేనని, ఏజీ ఆడిట్ పంపిన లేఖపై అధికారులతో చర్చిస్తామని అన్నారు.

బాలికల రక్షణ, అభివృద్ధికి కృషి చేయాలి

క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు అర్బన్/ కల్చరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బాలికల రక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలో 24వ జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువు సమాజ అభివృద్ధికి తోడ్పతుందని, ప్రతి ఒక్కరూ బాలికల చదువుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. నిర్వాహకులు లయన్స్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ బాలికదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హక్కులు చట్టాలు అనే అంశంపై ఈ వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు నుంచి పది సంవత్సరాల లోపు సబ్ జూనియర్స్‌గాను 11 నుంచి 15 సంవత్సరాల లోపు వారిని జూనియర్స్, 15 సంవత్సరాల పైబడిన వారిని సీనియర్స్ గాను పరిగణిస్తామని ఆసక్తిగల వారు వెంకటరమణ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్ కార్యాలయంలో 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపకులపతి

పాలలో నీళ్లలా..!

(5వ పేజీ తరువాయి)



ఆందోళన చేస్తున్న భూమా, టీడీపీ వర్గీయులు, పాల రైతులు(ఫైల్)

మూడు డైరెక్టర్ స్థానాలకు పదవీ కాలం ముగిసిపోవడంతో ఎన్నికల అధికారి హరి బాబు ఈ నెల 27వ తేదీ న నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలను ఏమాత్రం పట్టించు కోకుండా ఈ నెల 17వ తేదీన మూడు డైరెక్టర్ స్థానాలకు నామినేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆయితే భూమా వర్గీయులు, కొందరు టీడీపీ నాయకులు, పలువురు పాల రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో డెయిరీ తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చింది.

నోరు మెదపని అధిష్టానం..

ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో కూటమి అభ్యర్థులే గెలిచారు. అధికారం కూడా కూటమి సర్కారుదే. ఇంత బలం ఉన్నప్పటికీ విజయ డెయిరీ చైర్మన్ పదవిపై అటు అధిష్టానం కానీ.. ఇటు ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు కానీ నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని ముగ్గురు కీలక ప్రజాప్రతినిధుల అండదండలు ప్రస్తుత చైర్మన్‌కు ఉండడం ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇందులోభాగంగానే ఇక్కడ జరిగే వ్యవహారాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం లేదని సమాచారం.

ఇవన్నీ పక్కనబెడితే...

మొదట నుంచి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అంటే కొందరు ప్రజాప్రతినిధులకు సరిపోవడం లేదని కూటమి వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే భూమా కుటుంబంపై ఉన్న అసంతృప్తి, వివిధ కారణాలను సాకుగా చూపి కీలకమైన డెయిరీ చైర్మన్ పదవిపై అధిష్టానం దృష్టి పెట్టకపోవడమేంటని టీడీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. చైర్మన్ పదవి భూమా కుటుంబానికి కాకపోతే అధికార పార్టీలో పని కష్టపడి పని చేసిన వారిని గుర్తించి ఇవ్వొచ్చు కదా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు ప్రజాప్రతినిధులు చేస్తున్న లోగుట్టు వ్యవహారాలతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందన వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి నంద్యాల జిల్లాలో జరిగే పరిణామాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో పౌరహక్కులకు ప్రమాదం

సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి, పౌర హక్కులకు ప్రమాదం వాటిల్లుతుందని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్ అన్నారు. సోమవారం బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో లిబరేషన్ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల రాజ్యాంగ పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఏ మాత్రం భాగస్వామ్యం లేని ఆర్ఎస్ఎస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ దేశ స్వాతంత్ర్యానికి కొత్త భాష్యం చెబుతున్నారన్నారు. ఇలాంటి శక్తుల చేతుల్లో దేశం ఎక్కువ కాలం ఉంటే దేశం వందేళ్లు వెనక్కి వెళ్తుందన్నారు. ఆ లక్ష్యంతోనే మోదీ, అమిత్‌షాల నేతృత్వంలో బీజేపీ పాలన కొనసాగిస్తూ రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు మాట్లాడుతూ ఏపీలో బీజేపీ అధికారంలో లేకపోయినా టీడీపీ, జనసేన భుజాలపై స్వారీ చేస్తూ వారి మతోన్మాద రాజకీయాలను ఇక్కడ వ్యాప్తి చేస్తోందని విమర్శించారు. తెలుగు నేలపై నుంచి మతోన్మా రాజకీయాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, రాష్ట్ర స్టాండింగ్ కమిటి సభ్యులు ఉదయ్‌కిరణ్, రమణయ్య, ఏ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్

ఫిబ్రవరి 27న తిరుపతిలో రాయలసీమ పొలికేక

చాగలమర్రి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయల సీమకు తర తరాలుగా జరుగుతున్న అన్యాయాలపై ఫిబ్రవరి 27న తిరుపతిలో పొలికేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం రాయలసీమకు వస్తున్నాయని, ఓట్లు వేయించుకున్నాక అభివృద్ధిని విశాఖకు, అమరావతికి పరిమితం చేస్తున్నాయని మండిపడ్డారు. రాయలసీమలో స్టీల్ ప్లాంట్, నీరు, నిధులు ఏవీ లేవని అన్నారు. రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సీమ సంస్కృతి, సంప్రదాయాలైన ఉత్సవాలను, జాతరలతో పాటు సీమ స్వాతంత్రోద్యమ నాయకుల వర్ధంతి, జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలని అన్నారు. సీమ దళిత బంధు, రైతు బంధు పేరుతో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు కేటాయించాలని అన్నారు.



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అమలు చేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిరోధానికి గ్రామ, మండల స్థాయిలో ఏర్పడిన పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి చట్టంపై అవగాహన కల్పించి అమలు చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బాల్య వివాహాల నిషేధ చట్టం అమలుపై క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టంలోని జీఓలోని 31,39లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయలు జరిమానా విధించే అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలన్నారు. బాల్యవివాహాల నిషేధ చట్టం అమలు చేయడానికి పోలీసు యంత్రాంగం నుండి పూర్తి సహకారం అందిస్తామని అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి అరెస్టు

బనగానపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొద్ది రోజుల క్రితం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటిపై డ్రోన్ ఎగురవేసిన ఘటనలో వైసీపీ నాయకుడు అబ్దుల్‌ఫైజ్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15న నిందితుని కుమారుని వివాహంలో డ్రోన్లను పలుమార్లు మంత్రి ఇంటిపై పలుమార్లు ఎగరవేసినట్లు తెలిసింది. ఈ విషయంపై టీడీపీ, వైసీపీల మధ్య వివాదం రేగింది. టీడీపీ కార్యకర్త నరసింహ అబ్దుల్‌ఫైజ్ ఇంటికి వెళ్లి అడుగగా అబ్దుల్‌ఫైజ్ తనను ఐరన్ రాడ్‌తో దాడి చేసి, కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేసి అబ్దుల్‌ఫైజ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు 302 కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మంత్రి ఇంటిపై డ్రోన్ ఎగురవేయడం చట్టారీత్యా నేరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అబ్దుల్‌ఫైజ్ అరెస్టు విషయం తెలిసిన వెంటనే వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. విలేఖర్లతో మాట్లాడుతూ అబ్దుల్‌ఫైజ్ అరెస్టు అన్యాయమని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని పోలీసుల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె. నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో పురుగులమందు తాగి కురువ వెంకటేశ్వర్లు (52) ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం అలంపూరు చెందిన కురువ వెంకటేశ్వర్లు 8 ఏళ్ల క్రితం భార్య పిల్లలతో కలిసి పెద్దపాడు గ్రామానికి వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం కల్లులో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు చేయగా.. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కె.నాగులాపురం ఎస్ఐ ఆశాలత తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

దోపిడీ కేసు నమోదు

- అగంతకులు బీహార్ వాసులుగా అనుమానం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాణ్యం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీఎం వ్యవసాయ కళాశాల ఎదురుగా దంపతులపై జరిగిన దాడి సంఘటనలో దోపిడీ కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్ పరిశీలించిందన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి భూపనపాడు గ్రామానికి చెందిన జయమ్మ, జయన్నలు తమ కూతురిని చూడటానికి శాంతిరాం ఆసుపత్రికి వెళ్లారన్నారు. అనంతరం జయమ్మ బహిర్భూమికి సమీపంలోని జొన్న చేనులోకి వెళ్లింది. ఆమెకు తోడుగా భర్త కూడా వెళ్లాడు. వీరిద్దరిని అగంతకులు దాడి చేశారు. చేతులు కట్టివేసి తీవ్రంగా కొట్టారు. జయమ్మ వద్ద ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారు అతికష్టం మీద సమీప శాంతిరాం ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు దోపిడీ, దాడి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన అగంతకులు హిందీలో మాట్లాడినట్లు బాధితులు పేర్కొనడంతో బీహార్ వాసులుగా అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసినట్లు చెప్పారు.

మహిళ ఆత్మహత్య

నంద్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలిమిపేటకు చెందిన మంజుల (56) ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మంజుల ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా తన వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. సోమవారం ఇంట్లో ఉండగా కడుపునొప్పి రావడంతో భరించలేక రసాయన ద్రవాన్ని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి భర్త రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు.

నిందితుల అరెస్టు

బండిఆత్మకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరులో జరిగిన చోరీ కేసులో ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. సోమవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన దేవదాసు అనే వ్యక్తి సాయంత్రం 5.30గంటల సమయంలో పొలం వద్ద పని చేసుకుంటుండగా ఇద్దరు యువకులు డబ్బులు ఇవ్వాలని, లేని పక్షంలో చంపుతామని బెదిరించారు. దేవదాసు డబ్బులు లేవని చెప్పటంతో వెంటనే అతని చేతిలో ఉన్న కర్రను తీసుకుని తలపై చితకబాది అతని వద్ద రూ.1300 తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచరణ చేపట్టగా మండలంలోని పరమటూరుకు చెందిన ఇరువురు యువకులను సోమవరం సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1100 వసూలు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయండి

- వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి: కలెక్టర్



అక్షర వెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి పెండింగులో ఉన్న సర్వేను ఈనెల 31వ తేదీలోగా సచివాల ఎనర్జీ అసిస్టెంట్లతో పూర్తి చేయించాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలో ఇంకా 65వేల యూనిట్ల సర్వే పెండింగ్ ఉందని సచివాలయ సర్వే వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి:

15 నుంచి 50 సంవత్సరాలలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని స్వయం సహాయక బృందాల సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉల్లాస్ కార్యక్రమం కింద వయోజన విద్యాకేంద్రాలు ఈనెల 23 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

'అసంఘటిత కార్మికులు నమోదు చేసుకోండి'

అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఈ-శ్రామ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అసంఘటిత కార్మికులందరూ నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. భవన కార్మికులు, వలస కార్మికులు, ఇండ్లలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ఉపాధి వేతనదారులు, లఘు వ్యాపారులు ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదుయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా సంఘటనలు జరిగితే ఒక్కో వ్యక్తికి రెండు లక్షల రూపాయల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

పీఠం ఎవరికి?





- బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ
- రేసులో పలువురు సీనియర్లు.. ఎవరికి వారే ప్రయత్నాలు
- సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి
- ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠకు మరో చాన్స్ దక్కేనా?

కర్నూలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమిలో ఉన్న బీజేపీని బలోపేతం చేయడంపై జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఫోకస్ పెట్టింది. గ్రామస్థాయి నుంచి పార్టీ, అనుబంధ విభాగాలను బలోపేతం చేసేందుకు దృష్టి సారించింది. ఇప్పటికే మండల, కార్పొరేషన్ డివిజన్, మున్సిపల్ అధ్యక్షుల ఎంపిక పూర్తయింది. తాజాగా జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సహా పలువురు సీనియర్ నాయకులు అధ్యక్ష పీఠం కోసం పోటీ పడుతున్నారు. ఎలాగైనా అధ్యక్ష పదవి దక్కించుకోవడానికి జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠకు రెండో చాన్స్ దక్కుతుందా? అని పార్టీలో చర్చ జరుగుతోంది.

కర్నూలు జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు సహా పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్లు మండలాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అఖండ విజయం అందుకున్నాయి. ఇదే ఉత్సాహంతో సంస్థాగతంగా పార్టీని పటిష్ఠపరిచేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇటీవల విశాఖలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలువురి పేర్లు పరిశీలించినట్లు తెలుస్తోంది. దీంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎవరు..? అనే ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్య పార్టీ కావడం, దమాషా పద్ధతిన వచ్చే నామినేటెడ్ పదవులు ఎంపికలో జిల్లా అధ్యక్షుడి పాత్ర కీలకంగా ఉండబోతుండడంతో ఆ పీఠం కోసం పలువురు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సిద్ధాంత పరంగా చూస్తే పార్టీకోసం కష్టపడిన వారు, సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పటికే మండల, కార్పొరేషన్ డివిజన్లు, మున్సిపాలిటీల అధ్యక్షులను నియమించి, కూటమి పార్టీలతో పాటు జిల్లా ముఖ్య నాయకులు, సీనియర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లే నాయకుడికే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. రెండు మూడు రోజుల్లో నూతన అధ్యక్షుడి ఎంపిక జరిగే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

అధ్యక్ష పీఠం కోసం తీవ్ర పోటీ:

జిల్లా బీజేపీ అధ్యక్ష పీఠం కోసం తీవ్ర పోటీ ఉంది. ఆశావహులు ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు పది మంది నేతలు ఈ పదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మరోసారి తనకే అవకాశం ఇస్తారని ఆశగా ఉన్నారు. పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. అదే క్రమంలో ఎమ్మిగనూరుకు చెందిన సీనియర్ నాయకుడు లలిత్‌కుమార్ జైన్ కూడా పోటీ పడుతున్నారు. ఆయనకు 1992లోనే యువమోర్చా జిల్లా కార్యదర్శిగా, ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షుడిగా, అసెంబ్లీ కన్వీనర్‌గా పని చేసిన అనుభవం ఉంది. కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది గీతామాధురి సైతం జిల్లా అధ్యక్ష పీఠం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆమె ఉన్నారు. దాదాపు 20 ఏళ్లకుపైగా పార్టీలో ఉన్నా 2017 నుంచి కీలక నాయకురాలిగా కొనసాగుతున్నారు. మరో మహిళా నాయకురాలు హేమలతారెడ్డి కూడా అధ్యక్ష రేసులో పరుగులు పెడుతున్నారు. ఈమెకు మహిళా మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పని చేసిన అనుభవం ఉంది. ఏబీవీపీ నుంచి బీజేపీ కార్యక్రమాల్లో కీలకంగా పని చేస్తున్న అంబలి కాశీ విశ్వనాథ్ జిల్లా అధ్యక్ష పీఠం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇతనికి ఏబీవీపీ జిల్లా కో-కన్వీనర్‌గా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఉంది. అలాగే.. ఆదోనికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త విట్టా రమేశ్, మంత్రాలయం నుంచి కౌతాళం అక్కమతోట రామకృష్ణ, కోడుమూరుకు చెందిన ప్రేమ్‌కుమార్, ఆదోనికి చెందిన సీనియర్ నాయకుడు మలేకార్ శ్రీనివాస్, ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి ఈరన్న అధ్యక్ష రేసులో ఉన్నారని ఆ పార్టీలో నాయకులు పేర్కొంటున్నారు. అధ్యక్ష పీఠం కోసం 12 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిసింది.

పార్టీ బలోపేతంపై ఫోకస్

జిల్లా నుంచి తొలిసారిగా ఆదోని ఎమ్మెల్యేగా డాక్టర్ పార్థసారథి గెలిచారు. ఎక్కడైతే బీజేపీ గెలిచే ఛాన్స్ లేదని రాజకీయ విశ్లేషకులు చెప్పారో అక్కడే విజయం సాధించి సత్తా చాటిన కాషాయం పార్టీ 2029 ఎన్నికల నాటికి రెండు మూడు నియోజకవర్గాల్లో విజయం సాధించేలా క్షేత్రస్థాయి నుంచి పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలో కలసి సత్తచాటాలని ఎత్తులు వేస్తోంది. అందులో భాగంగానే నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు నడిపిం చేవారికి జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించాలని రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఆ అర్హతలు ఉంటేనే..

బీజేపీ సిద్ధాంతం ప్రకారం మండల పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలంటే 45 ఏళ్లు దాటకూడదు. జిల్లా అధ్యక్ష పదవికి 60 ఏళ్లలోపే ఉండాలి. అలాగే.. రెండు పర్యాయాలు పార్టీ సభ్యత్వం (12 ఏళ్లు) ఉండాలి. గతంలో రెండు పర్యాయాలు పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఉండకూడదు. ఈ అర్హతలతో పాటు సామాజిక, రాజకీయ సమీకరణాలను పరిగణలోకి తీసుకొని జిల్లా అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు.

నీటి కుంటలో పడి అక్క, తమ్ముడి మృతి

- జంపాపురం గ్రామంలో విషాదం



మృతి చెందిన అక్క, తమ్ముడు

కోసిగి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ పొలంలోని ఎద్దులు, గొర్రెలను మేపేందుకు వెళ్లి పక్కనే ఉన్న నీటి కుంటలో దిగి అక్క, తమ్ముడు మృతి చెందారు. ఈ ఘటన జంపాపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కురువ నరసింహులు, పద్మావతి దంపతుల పిల్లలు నరసమ్మ (12) ఎనిమిదో తరగతి, రఘునందన్ 5వ తరగతి చదువుతున్నారు. నరసమ్మ ఎమ్మిగనూరులోని జడ్పీ బాలికల పాఠశాలలో చదువుతోంది. రఘునందన్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల తర్వాత సోమవారం పాఠశాలలు తెరిచినా.. వీరు బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండి తల్లిదండ్రులకు సాయంగా గొర్రెలు మేపేందుకు వెళ్లారు. వారి పొలం పక్కనే ఉన్న వంకలోని నీటి కుంట వద్ద పెద్దనాన్న కుమారుడు వంశీతో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత నీరు తాగేందుకు కుంటలోకి దిగారు. ఈత రాకపోవడంతో బురదలో ఇరుక్కుపోయి ఊపిరాడక మునిగిపోయారు. గట్టుపై ఉన్న వంశీ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పెద్దఎత్తున తల్లిదండ్రులు, గ్రామస్థులు వెతికారు. అప్పటికే అక్క, తమ్ముడు మృతి చెందారు. ఎస్ఐ చంద్రమోహన్ చేరుకున్నారు. పెద్ద నరసింహులు, పద్మావతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వారిలో కూతురు, చిన్నకొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దీంతో జంపాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వంతెన నుంచి కింద పడిన లారీ

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

జోగిపేట, జనవరి20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అందోలు మండలం సంగుపేట జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ లారీ వంతెనపై నుంచి బోల్తా కొట్టగా, లారీ నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా బేతంచెర్ల నుంచి నాపరాళ్ల(బండలు) లోడ్‌తో లారీ రాజస్థాన్ వెళ్తుతోంది. సంగుపేట వద్ద జాతీయ రహదాదరిపై గల వంతెనపైనుంచి అదుపుతప్పి, పల్టీకొట్టి బోల్తాపడింది. లారీ నుజ్జునుజ్జైంది, డ్రైవర్ షకీర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోగా, క్లీనర్ ధర్మేందర్‌సింగ్ గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ పాండు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. 3 గంటల పాటు కష్టపడి గ్యాస్ కట్టర్‌తో క్యాబిన్‌ను కోసి డ్రైవర్ షకీర్‌ను బయటకు తీశారు. వారిని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సచేయించి, మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ పాండు తెలిపారు. కాగా, శివమాలలో ఉన్నప్పటికీ.. విధి నిర్వహణ మరువక... క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికితీసిన హోంగార్డు శ్రీశైలంను పలువురు అభినందించారు.

సంగీత దర్శకుడు ఫయూమ్ ఆకస్మిక మృతి



కర్నూలు కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో తొలి సంగీత దర్శకుడిగా, గాయకుడిగా, రికార్డింగ్ స్టూడియో అధినేతగా పేరు తెచ్చుకున్న మ్యూజిక్ మ్యాస్ట్రో ఫయూమ్ (55) ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. నగరంలోని వడ్డెవీధిలో సెవెన్ స్టార్స్ పేరుతో మ్యూజిక్, డబ్బింగ్ స్టూడియో నిర్వహిస్తున్న ఆయన తన స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 1989లోనే నగరంలో తొలి మ్యూజిక్ రికార్డింగ్ స్టూడియో ప్రారంభించిన ఆయన దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోయారు. జిల్లాతో పాటూ అటు తెలంగాణ ప్రాంతాల నుంచి కళాకారులు, గాయకులు తమ పాటలను రికార్డింగ్ చేయించడానికి ఫయూమ్‌ను ఆశ్రయించేవారు. ఆయన అనేక మంది ఔత్సాహిక గాయకుల పాటలకు బాణీలు కట్టి, ఆల్బమ్స్ రూపంలో తయారుచేసి ఇచ్చారు. గత 40 ఏళ్లుగా ఆయన వేలాది పాటలను కూర్చి గాయకుల ఎదుగుదలకు కృషి చేశారు. అలాగే స్వయంగా సెవన్‌స్టార్ ఆర్కెస్ట్రా పేరుతో స్థానిక గాయకులను ప్రోత్సహిస్తూ వందలాది కచేరీలు, సంగీత విభావరులు నిర్వహించారు.

బాలు పాట, ఫయూమ్ సంగీతం

కర్నూలు కళాకారులు నిర్మించిన 'సాయి లీలలు' అనే చిత్రానికి ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు పాడగా, ఫయూమ్ సంగీత దర్శకత్వం వహించారు. పలు లఘు చిత్రాలకు కూడా సంగీత దర్శకత్వం వహించారు. 2016లో నాటి ఎస్పీ ఆకే రవికృష్ణ భ్రూణహత్యలకు వ్యతిరేకంగా, నేత్రదానం ఆవశ్యకతపై రూపొందించి, గానం చేసిన వీడియోలకు కూడా ఫయూమ్ సంగీతం అందించారు. ఈ రెండు వీడియోలకు అమెరికాలోని 'తానా' సంస్థ స్పాన్సర్ చేసి విడుదల చేసింది. ఈనెలలో కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'గుడ్‌టచ్...బ్యాడ్ టచ్' అనే వీడియో సాంగ్‌ను ఎస్పీ బిందుమాధవ్ విడుదల చేశారు. తొలిరోజుల్లో వర్ధమాన గాయకులు గీతామాధురి, మాళవిక , హేమచందర్ వంటి గాయకులు కూడా తమ ఆల్బమ్‌లను ఫయూమ్‌తో రూపొందించుకున్నవారే. బహుముఖ ప్రజ్ఞతో రాణించిన పాటల తోటమాలి దూరం కావడం దురదృష్టకరమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా, గజల్ గాయకుడు మహ్మద్ మియా, సినీ నటుడు బైటింటి మీనాక్షిరెడ్డి, గాయకుడు చంద్రకంటి మద్దయ్య, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి సంతాపం తెలిపారు.

పోలీసు పరిష్కార వేదికకు 78 ఫిర్యాదులు

- చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం
- ఎస్పీ జి.బిందుమాధవ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 78 ఫిర్యాదులు వచ్చాయి. స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

- కర్నూలుకు చెందిన హసీనా బేగం, మహబూబ్ బాషా కలిసి కర్నూలులోని మద్దూరునగర్‌లో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.80 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు ఎల్బీఎస్ నగర్‌కు చెందిన వీర అరుణ్ కుమార్ ఫిర్యాదు చేశారు.
- 30 గొర్రెలు దొంగతనం చేసిన బాలు, నాగ రాజు, దుబ్బ రామకృష్ణపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని సి.బెళగల్ మండలం పోలక ల్లుకు చెందిన పలుదొడ్డి జమ్మన్న ఫిర్యాదు చేశారు.
- తన కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు సోమిశెట్టినగర్‌కు చెందిన రామయ్య ఫిర్యాదు చేశారు.
- మా కుమార్తె చనిపోయింది. ఇద్దరు కుమార్తెలకు ఆస్తి ఇవ్వకుండా నా అల్లుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన జి.వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు.
- నాకు తెలియకుండానే నా పేరు మీద రూ..లక్ష గొర్రెల లోను తీసుకుని బ్యాంకులో పని చేసే చంద్ర, చాంద్‌బాషాలు కలిసి మోసం చేశారని దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన అరుణమ్మ ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కార్మికులను కనీస వేతనాలు అమలు చేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పని చేస్తున్నటువంటి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల (శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రణీత్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.మునెప్ప మాట్లాడుతూ ఏజెన్సీల కింద పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. శానిటేషన్ కార్మికులకు జీవో.నెం.549 ప్రకారం రూ.16వేలు, సెక్యూరిటీ గార్డులకు జీవో.నెం.43 ప్రకారం రూ.12,900లు వేతనం అమలు చేయని ఏజెన్సీలను టెండర్లలో పాల్గొ నకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సెక్యూరిటీ, శానిటేషన్ సీనియర్ నాయకులు రాజు, సురేష్, సునీత పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రంలో వృద్ధుడిపై దాడి

కర్నూలు క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో స్వాములు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి రూ.13,500 నగదు చోరీ చేశాడు. ఈ ఘటన ఈ నెల 16వ తేదీన జరగగా.. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు నంద్యాల జిల్లా జలదుర్గం చెందిన నాగరాజుగా గుర్తించారు. నిందితుడు కర్నూలులో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో సహస్ర బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ జల్సాలు చేస్తున్నారు. నిందతుడిని సోమవారం సాయంత్రం అరెస్టు చేసి అతని వద్ద నుంచి నగదును రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజరాజేశ్వరి నగర్‌లో జరిగిన చోరీ కేసులో నిందితుడు నిరంజన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 17న గౌతమి అనే మహిళ తన ఇంటికి తాళం వేయకుండా డోర్ మాత్రమే వేసి కింద ఉన్న పార్కింగ్ ఏరియాలో పిల్లలను ఆడించుకుంటూ ఉంది. నిందితుడు చాకచక్యంగా ఆమె ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు నగలు చోరీ చేశారు. సీసీ కెమెరాల ఆదారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 220 కేవీ విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటు oదని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 10 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు బీ.క్యాంపు సెక్షన్ పరిధిలోని కాలనీల్లో కరెంట్‌కోత ఉంటుందని ఏడీఈ సుబ్బన్న తెలిపారు. ఈ మేరకు విజ్ఞాన మందిరం, బీ.క్యాంపు, జేసీ బంగ్లా, అరోరానగర్, డాక్టర్స్ కాలనీ, టెలికాం నగర్, మహాలక్ష్మీనగర్, అమ్మ హాస్పిటల్ ఏరియా, నంద్యాల చెక్‌పోస్టు, నందికొట్కూరు రోడ్డు, జోహరాపురం, బిర్లాగడ్డ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి'


ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీర్లు

కర్నూలు న్యూసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఈఈ ఎన్‌సీఎస్ మద్దన్న అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీర్లు సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి అతివేగంగా, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెంట్ లేకుండా ప్రయాణాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో డీఈఈలు మహేశ్వరరెడ్డి, కర్రెన్న, నాగిరెడ్డి, ఏఈలు ఆర్ సతీష్ కుమార్, ముక్తార్‌బాషా, రవి మోహన్ రెడ్డి, అచ్యుతానందరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

ఉప విద్యాశాఖ అధికారి పోస్టుల్లో
గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను నియమించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న ఉప విద్యాశాఖ అధికారి పోస్టుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తున్న సీనియర్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను నియమించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. సోమవారం డీటీఎఫ్ రాష్ట్ర శాఖ నిర్వహించిన సమావేశానికి డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నగరహరి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి రమణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరే కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గట్టు తిమ్మప్ప, పత్రికా ప్రధాన సంపాదకులు రత్నం యేసేపు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉప విద్యాధికారి పోస్టులను జోన్-2లో ప్రభుత్వ యజమాన్యంలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవోలుగా నియమించడాన్ని డీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా ఎంఈవోలను నియమించాలని డిమాండ్ చేశారు.

నేడు జాబ్‌మేళా

కోడుమూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిసున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో ఫ్యూజన్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ సమస్థ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. 18-30 ఏళ్లలోపు డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు విద్యార్హత ప్రతులు, బయోడెటాతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారిగా రుద్రారెడ్డి



కర్నూలు స్పోర్ట్స్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ఎన్నికల్లో రుద్రారెడ్డిని రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రుద్రారెడ్డి ఎన్నికపై జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, ఈశ్వర్, నాయుడు, అవినాష్, శ్రీధర్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రుద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సంఘం నాయకులు తనన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి

కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించ డానికి ప్రభుత్వం ఉచితంగా గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరాల ద్వారా పశు వైద్య చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖాధికారి జీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజన్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి: జిల్లాలో విద్యార్థులు వలస వెళ్లకుండా సీజన్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాల యం మండలాల్లోని చిన్నభూంపల్లి, కందుకూరు, దుద్ది, దొడ్డి బెళగల్, జంపాపురం, కడిదొడ్డి గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు


పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వలస వెళ్తున్నారన్నారు. వీరికి మండల కేంద్రాల్లో ప్రధాన గ్రామ పంచాయతీల్లో సీజనల్ హాస్టళ్ల ఏ ర్పాటు చేసి వారి భవిష్యత్తును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సాయి మల్లేష్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి: నగరంలోని బుధవారపేటకు చెందిన ఉమ్మడి సుంకులమ్మ, ఆమె కుమారులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమ స్యల పరిష్కారవేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం చనిపోయిన పెద్ద కుమారుడు దేవదాసు పోస్టుమార్టం రిపోర్టును డాక్టరు నేటి వరకు ఇవ్వలేదని ఆరోపించారు. కొందరు ఆస్తి, డబ్బు కోసం తన కొడుకును చంపారని అన్నారు. వీరు దౌర్జన్యంగా ఇంటిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. తనకు మిగతా కుమారులకు ప్రాణహామీ ఉందని కలెక్టర్‌కు విన్నవించారు.

విభిన్న ప్రతిభావంతుల పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై విభిన్నప్రతిభావంతులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలు 16 ఈవెంట్లు 100మీటర్ల నుంచి 1800 మీటర్ల వరకు, షార్ట్‌పుట్, జావెలింగ్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్, డిస్కస్ త్రో తదితర ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము విభిన్నప్రతిభా వంతులమని కుంగిపోకుండా క్రీడాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా విభాగం, పరుషుల విభాగాల నాయకులు మనోహర్ రెడద్ది, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రాజు, కుమ్మరి మద్దిలేటి, సహాయ


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సురేష్ నాయుడు, ఈసీ మెంబర్ మక్బూల్ బాషా, ఉద్యోగుల సంగం జిల్లా అధ్యక్షులు కే.కృష్ణుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం తేవాలి

ఎంపీకి అఖిలపక్షం రైతు సంఘం నాయకుల వినతి


ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చట్టం తీసుకరావాలని అఖిలపక్షం రైతు సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామం లో సోమవారం ఎంపీ నాగరాజుకు అఖిలపక్ష రైతు సంఘాల నాయ కులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు కూలీ సంఘం నాయ కులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2021లో కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకవస్తే వాటిని వ్యతిరేకిస్తూ ఏడాది పాటు రైతులు ఆందోళన చేస్తే అందులో దాదాపు 750మంది రైతులు చనిపోయారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీని కలిసిన వారిలో రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్, మండల రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, తాండ్రపాడు సర్పంచు బాలాపీరా, హుస్సేనయ్య, గోపాల్ శ్రీనివాస్‌రెడ్డి నరసింహ, బాషా ఉన్నారు.

పేరుకే మద్దతు ధర

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంట ఉత్పత్తులకు ఖర్చును అంచనా వేసి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మద్దతు ధరను ప్రకటిస్తున్నాయే కానీ.. అవి మార్కెట్ యార్డుల్లో రైతులకు వ్యాపారుల నుంచి దక్కుతున్నాయో లేదో.. పరిశీలించడం లేదని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో రైతులు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించ కపోవడం దారుణమన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో రైతులకు అందడం లేదని, కనీసం కాస్తో కూస్తో అందిన పంట ఉత్పత్తులకైనా మార్కెట్ యార్డుల్లో రైతు లకు మద్దతు ధరలు అందించడం లేదన్నారు. వచ్చే పంట సాగు సంవత్సరానికైనా ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ప్రభుత్వం ఆయా పంట ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలుగులో పద్య నాటకాలు రావాలి

కర్నూలు కల్చరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగులో పద్య నాటకాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అన్నారు. ఆదివారం రాత్రి ఒంగోలులో ప్రారంభమైన జాతీయ స్థాయి నాటక పోటీల సభలో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబు లయ్య రాసిన 'తెలుగు భోజుడు' నాలుగో ముద్రణ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈదర హరిబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి గుండె చప్పుడు అని, గత ఐదేళ్లుగా నిలిచిన నాటకోత్సవాలు తిరిగి ప్రారంభించామని తెలిపారు. ఎన్టీఆర్‌పై ముద్రించిన తెలుగు భోజుడు పుస్తక నాలుగో ముద్రణ తన చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఒకప్పుడు తెలుగు భాషలో అనేక పద్య నాటకాలు పుస్తకాల రూపంలో లభించేవని, నేడు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. పుస్తక రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా తొలి ముద్రణతో ఆవిష్కరించిన ఈ పుస్తకం తిరిగి ఎన్టీఆర్ కళాపరిషత్ పోటీల్లో ఆవిష్కరించుకోవడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల నేతలు నారాయణ, ఫణీంద్ర, సాహితీ స్రవంతి కన్వీనర్ జేఎస్ శేషయ్య పాల్గొని ప్రసంగించారు.

నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం


ఓర్వకల్లులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని మండల ఐక్య సంఘం శిక్షణా భవనంలో ఉల్లాస్ యోజన విద్య అక్షరా స్యతపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ నిరక్షరాస్యులుగా ఉన్న ప్రతి ఒక్క మహిళ సాయంత్రం సమయ వేళల్లో 2 గంటల సేపు అక్షరాలు నేర్చుకుని ప్రయోజకులు కావాల న్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అడిషినల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ఏపీఎం వెంకట్రామిరెడ్డి, వలం టీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మహిళలంతా అక్షరాలు నేర్చుకునేలా వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీవో రాముడు, ఏపీఎంలు సుబ్బయ్య ప్రతాప్ అన్నారు. సోమవారం వెలుగు భవనంలో ఉల్లాస్ వయోజన విద్య అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి మహిళా అక్షరాలు నేర్చుకోవడానికి ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. వయోజన విద్య ఏపీఎం ప్రతాప్ శిక్షణలో భాగంగా పలు విషయాలు తెలిపారు. అనంతరం ఏపీఎం సుబ్బయ్య చేతులమీదుగా వర్క్ బుక్కులు, పెన్సిళ్లు అందించారు.

ఉపాధి పనులు వినియోగించుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

కోడుమూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వలసలు వెళ్లకుండా గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులు వినియోగించుకోవాలని ప్రజలకు ఎంపీడీవో రాముడు, ఏపీవో మోదీన్ బాషా సూచించారు. సోమవారం క్రిష్ణాపురంలో ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. నిర్ణీత కొలతల మేరకు పనిచేసి రూ.300 వేతనం పొందవచ్చని వివరించారు.

7ఏ సైడ్ హాకీ విజేత ఎస్టీబీసీ కాంపౌండ్ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నెహ్రూ మెమోరియల్ పూర్వ విద్యార్థులు రాము, త్రినాథ్, ఈశ్వర్, టీవీ నటుడు రఫిక్షా ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న సంక్రాంతి 7 ఏసైడ్ హాకీ టోర్నమెంటు విజేతగా ఎస్టీబీసీ సీనియర్ జట్టు రూల్స్ బ్రేక్ హాకీ క్లబ్‌పై 3-1 విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం విన్నర్‌కు రూ.3వేలు, రన్నర్‌కు రూ.1,500 నగదుతోపాటు ట్రోఫీ కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ హాకీ క్రీడాకారుడు మాధవరావు, రాము, ఆదినారాయణ, సుదర్శన్ విక్రమ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకూడదని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. కార్యక్రమంలో అడిష నల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్ఈ రాజశేఖర్, మేనేజర్ చిన్నరా ముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

సమస్యలు సమన్వయంతో పరిష్కరించాలి: కాలనీల్లోని చిన్నపాటి సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన వడ్డెగేరి, బుధవార పేట, ఎ.క్యాంపు, జోహరాపురం ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కొండారెడ్డి బురుజు వద్ద మ్యాన్‌హోల్‌పై వెంటనే మూత పెట్టించాలని, బుధవార


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

పేట, ఎ.క్యాంపుల్లోని ప్యాకెట్ పార్కులను అభివృద్ధి చేయా లని, జోహరాపురంలో మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ మనోహర్ రెడ్డి, ట్రైనీ ఏఈ రామ్మోహన్ ఉన్నారు.

గ్రామాల్లో పనులు కల్పించాలి: సీపీఎం


వలస కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసల నివారణకు గ్రామాల్లో పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, ఆదోని మండలాల నుంచి హైదారాబాదు, గుంటూరుకు ఐచర్ వాహనాలలో వలస వెళ్తున్న కూలీలను సీపీఎం నాయకులు కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఒక ఐచర్ వాహనంలో పది కుటుంబాలు తమ సామాన్లను వేసుకుని చలికి వణుకుతూ ఒకరిపై ఒకరు పడుకుని బతకడం కోసం వలసలు వెళ్లడం బాధాకరమన్నారు. పదో తరగతి విద్యార్థులను కూడా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారని అన్నారు. తక్షణమే గ్రామాలలో పనులు కల్పించి రోజువారి కూలి రూ.400 ఇవ్వాలన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా గ్రామాల్లో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్ రాధాక్రిష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, గురుశేఖర్, రంగప్ప, కరుణాకర్, అమర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే


పర్లలో రీసర్వే పనులను ప్రారంభిస్తున్న తహసీల్దారు

కల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం పకడ్బందీగా రీసర్వే చేపడుతుందని కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు అన్నారు. సోమవారం పర్ల గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్ కింద భూముల రీసర్వే పనులను ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూ వివాదాల సమస్యలు పూర్తిగా తొలుగుతాయన్నారు. పర్లలో దాదాపు 8700 ఎకరాల భూమి ఉండగా 4 వేల ఖాతాలు ఉన్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్వే డీటీ జయశ్రీ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శేఖర్, ఎంపీటీసీ శేషన్న సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చనుగొండ్లలో రీసర్వే సందర్భంగా పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రీసర్వే డిటీ మాట్లాడుతూ చనుగొండ్ల గ్రామంలో 7,765 ఎకరాలు భూములు ఉన్నాయని, దీనికి సంబంధించి రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండల సర్వేయర్ బాలు నాయక్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జి.ఆద్యశ్రీ అనే విద్యార్థిని సాయి స్కంద ఇండియన్ డిబెటింగ్ లీగ్, ఐఐటీ చెన్నై ఆర్బే టరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. జనవరి 26న రిపబ్లిక్ డే రోజు ఐఐటీ చెన్నైలో జరిగే పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ సోమవారం తెలిపారు. విద్యార్థిని సీఈవో గోపినాథ్, కో-సీఈవో సౌమ్య గోపినాథ్, డీన్ రాజేంద్రన్ అభినందించారు.

మూగ జీవాల బాధ్యత మనదే..

పశుసంవర్థక శాఖ జేడీ శ్రీనివాస్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేడీ శ్రీనివాస్ తదితరులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాల బాధ్యత మనదేనని పశుసంవర్థక శాఖ జేడీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయంలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ 2025 నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో మూగ జీవాల సంరక్షణ బాధ్యతలను తాము ఎంతో విజయవంతంగా నిర్వ ర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్, లైవ్ స్టాక్ అసిస్టెంట్, జూనియర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అసోసియేషన్లతోపాటు పశుసంవర్థక శాఖ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగ వాసవి, కార్యదర్శి సురేష్, వీఏ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు స్రవంతి, నాయకులు జనార్దన్ రెడ్డి, రంగన్న, బాబురావు పాల్గొన్నారు.

ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్ విడుదల


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఏపీఎన్జీవో చైర్మన్ వెంగళ్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయుసీ-3194) జిల్లా సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్‌ను ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పని చేసే ఏఎన్ఎం, ఇతర ఉద్యోగులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. ఏపీఎన్జీవో జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణుడు, సిటీ అధ్యక్షుడు కాశన్న, కార్యదర్శి రామకృష్ణ, యూనియన్ (ఐఎన్ టీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ నరసింహులు, ఎన్‌డీ సంపత్ కుమార్, జిల్లా కోశాధికారి ఎస్.సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈ.బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

బాధితులు నేరుగా ఫిర్యాదు చేయండి

● ఆదోని నూతన డీఎస్పీ మర్రిపాటి హేమలత



ఆదోని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బాధితులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని నూతన డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. సోమవారం ఆమె ఆదోని డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. తన సొంత ఊరు అన్నమయ్య జిల్లా మదనపల్లి అని తల్లిదండ్రులు హరికృష్ణ లక్ష్మి అని తెలిపారు. బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ గ్రూప్ వన్‌లో ర్యాంక్ సాధించి, గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందానన్నారు. ఆదోని డీఎస్పీగా మొదటి పోస్టింగ్ అని తెలిపారు. పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచేలా సేవలదిస్తానని డీఎస్పీ అన్నారు.

మినీ గోకులాలను పూర్తి చేయండి

మద్దికెర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి పథకం ద్వారా చేస్తున్న మినీ గోకులాల పనులు పూర్తి చేయాలని ఏపీవో నర్సిరెడ్డి సూచించారు. సోమవారం మద్దికెర గ్రామంలో మినీ గోకులాలను పరిశీలించారు. మండలంలో 23 మినీ గోకులాలను నిర్మిస్తున్నాయనీ, 4 గోకులాలు ప్రారంభమయ్యాయన్నారు.

డీఎల్‌డీవోగా అనురాధ



పత్తికొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):డివిజనల్ డెవప్‌మెంట్ అధికారిగా అనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి బదిలీపై పత్తికొండకు వచ్చినట్లు అనురాధ తెలిపారు. డివిజన్ పరిధిలో అధికారులతో కలిసి పని చేస్తామని ఆమె అన్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి

మద్దికెర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశుసంపదను కాపాడుకోవాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ సూచించారు. సోమవారం ఎడవలి గ్రామంలో పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. 85 పశువులకు టీకాలు వేసి, జీవాలకు నట్టల నివారణ మందులు తాపామని, గర్భకోశ వ్యాధులకు చికిత్స, కుక్కలకు రేబిస్ టీకాలు వేశామని తెలిపారు. పశువులకు వ్యాధి సోకితే పశువైద్యశాలకు తీసుకురావాలని కోరారు. సిబ్బంది భారతి, శ్వేత, లక్ష్మణ్, ప్రియదర్శిని, హరిత, తదితరులు ఉన్నారు.

నేడు బసినేపల్లిలో పశువైద్య శిబిరం..

బసినేపల్లి గ్రామంలో మంగళవారం పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని పశువైద్యాధికారి తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక



అవినాష్, సుంమగళ, సంధ్య

ఆదోని అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఆదోని క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించగా, పురుషుల జట్టుకు అరుణ్ జ్యోతినగర్‌కు చెందిన అవినాష్, మహిళా జట్టుకు హనుమాన్ నగర్‌కు చెందిన సుమంగళ, కస్తూర్బా విద్యార్థిని సంధ్యను ఎంపిక చేశారన్నారు. ఈనెల 25నుంచి విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో రాష్ట్ర జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

ఆలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలని దళిత సంఘం నాయకులు కొమ్ము రామాంజినేయులు, మాసాల జగన్, గోవింద్, మధు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో సూర్య నారాయణకు వినతిపత్రం అందించారు. దళితులు వివాహాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేస్తే టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో అభివృద్ధి చేసుకుంటామని కోరారు. స్పందించిన ఎంపీడీవో సచివాలయాన్ని త్వరలోనే సొంత భవనానికి మార్పు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంఆఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ కుమార్, రవి పాల్గొన్నారు.

రైతులతో కలిసి రీసర్వే చేయండి



రీసర్వేను ప్రారంభిస్తున్న ఆర్డీవో

● ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రీసర్వేను రైతులతో కలిసి పకడ్బందీగా చేయాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. సోమవారం మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీలో భూరీసర్వేను ఆర్డీవో ప్రారం భించారు. గత రీసర్వేలో రోజువారీ టార్గెట్ ఎక్కువగా ఉండటంతో తప్పులు దొర్లినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అయితే ఇప్పుడు రోజుకు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేస్తున్నామని, పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సర్వేయర్ గాదె లింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ కేంద్రాల ఏర్పాటు

హొళగుంద, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల కోసం బాల ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో విజయ లలిత సోమవారం తెలిపారు. హొళగుంద, చిన్నహ్యాట, నేరణికి, హెబ్బటం, సులువాయి, గ్రామంలోని సచివాలయాల్లో 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు కేంద్రాలు పనిచేస్తాయన్నారు.

అడుగుకో గుంత..

● అధ్వానంగా చత్రగుడి-బళ్ళారి రహదారి
● 3 కి.మీ. పొడవునా గతుకులే..
● ఇప్పటికే పలువురు మృత్యువాత



గుంతలమయంగా ఉన్న ఛత్రగుడి రోడ్డు

హాలహర్వి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు కిలో మీటర్లు ఉండే చత్రగుడి-బళ్ళారి రోడ్డు అధ్వానంగా మారింది. అడుగుకో గుంతలా మారింది. దీంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ రహదారి మీదుగానే ఎన్‌హెచ్ 67కు వెళ్లాలి. అలాగే ఆదోని, మంత్రాలయం, రాయచూరు, కర్నూలు, హైదరాబాద్, బళ్ళారి, బెంగళూరు తదితర ప్రధాన పట్టణాలకు కూడా ఈ రోడ్డుపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.

గుంతలమయం..

గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్డంతా గుంతలమం యగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే ఈ మార్గం నరకం చూపుతోందని ప్రయాణీకులు ఆందోళనకు గురవుతున్నారు. కేవలం మూడు కిలోమీటర్ల దారే యమపాశంగా మారుతోంది. ఇప్పటికే కొందరు మృతి చెందారు. ఎంతోమంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

● గత సంవత్సరం కామినహాల్ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి ప్రయాణికుడు బస్సులో నుంచి పడి మృతి చెందారు.
● చత్రగుడికి చెందిన సతీష్ బళ్లారి నుంచి స్కూటర్‌పై వస్తూ ప్రమాదంలో మృతి చెందారు.
● గతేడాది కార్లు ఢీ కొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
● సరుకుల లారీలు నిత్యం బోల్తా పడుతుంటాయి.
● నవంబరులో కర్ణాటకకు చెందిన కూలీల ఆటో బోల్తాపడి నలుగురు మృతి చెందారు. 13 మందికి గాయాలయ్యాయి.
● డిసెంబరులో ప్రైవేట్ బస్సు గుంతల్లో అదుపు తప్పి 20 గొర్రెలపై దూసుకెళ్లడంతో మృత్యువాత పడ్డాయి. ఇంకా ఎన్నో ప్రమాదాలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

నూతన రహదారి నిర్మించాలి



చిత్రగుడి రోడ్డు పూర్తి అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన రహదారి నిర్మించాలి.

- దర్గావలి, ప్రయాణికుడు

ప్రతిపాదనలు పంపాం

చత్రగుడి నుంచి మూడు కిలోమీటర్ల రహదారి పంచాయతీ రాజ్ పరిధిలో ఉంది. రహదారి నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కలెకర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు తీసుకుంటాం.

- వరలక్ష్మి, ఎంపీడీవో, హొలహర్వి

ఆర్డీటీ సేవలు మరువలేనివి

● కేపీ గుడిసెల్లో 36 ఇళ్ల ప్రారంభం
● స్పెయిన్ దేశస్థులను సన్మానించిన గ్రామస్థులు



స్పెయిన్ దేశస్థులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీటీ సంస్థ సేవలు మరువలేనివని టీడీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, సర్పంచ్ రంగమ్మ అన్నారు. సోమవారం మండలంలోని కేపి గుడిసెల్లో ఆర్డీటీ నిర్మించిన 36 ఇళ్లను స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు. గ్రామస్థులు, సర్పంచ్ స్పెయిన్ దేశస్తులను శాలువలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఆర్డీటీ ప్రతినిధులు సరస్వతి, రెహినాతో పాటు స్పెయిన్ దేశస్థులు మాట్లాడుతూ అందరి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేస్తామని, ఇళ్ల, పాఠశాల, వైద్యశాలను నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. నాయకులు దేవేంద్ర, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం పట్టణంలోని తేరు బజారులో సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఇక్కడ రోడ్డు లేకపోవడంతో స్థానికులు తన దృష్టికి తెచ్చారని అధికారులను రోడ్డు వేయాలని ఆదేశించానన్నారు. కాంట్రాక్టర్ దశరథరామిరెడ్డి, టీడీపీ నాయకులు సింగం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశాడు

● అధ్యాపకుడిపై విద్యార్థిని ఫిర్యాదు

ఆదోని/అగ్రికల్చర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): నమ్మించి మోసం చేశాడని ఓ విద్యార్థిని అధ్యాపకుడిపై సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. మంత్రాలయం నియోజకవర్గంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా ఓ అధ్యాపకుడు ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. విద్యార్థిని తిరస్కరించినా వేధింపులకు గురి చేశాడు. ఇంట్లో అపోహలు సృష్టించడంతో ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అవమానాన్ని భరించలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు పొలం పనులకు పంపడంతో బయటకు వచ్చేసి, తనకు చదువుకోవాలని ఉందని ఎమ్మిగనూరు డీఎస్పీని ఆశ్రయించింది. ఆయన సాయంతో ఆదోనిలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి, స్నేహితురాలి సాయంతో హాస్టల్‌లో ఉంది. గతేడాది మార్చి 1న ఓ కళాశాలలో పరీక్షలు రాస్తుండగా స్క్వాడ్‌గా వచ్చిన అధ్యాపకుడు హాస్టల్ దగ్గరకొచ్చి పరీక్షకు సంబంధించిన విషయాలు చెప్తానని నమ్మించి శారీరకంగా మోసం చేశాడు. విద్యార్థిని ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేస్తుందంటూ అధ్యాపకుడు గత ఏడాది డిసెంబరు 18న కౌతాళంలో విద్యార్థినిపై ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని విద్యార్థిని సబ్ కలెక్టర్‌ను కోరింది.

కుష్ఠు నిర్మూలన అందరి బాధ్యత

ఆదోని రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి తెలిపారు. సోమవారం కుష్ఠువ్యాధి నిర్మూలనలోభాగంగా, ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సిబ్బందితో సర్వే చేస్తున్నామని, ఫిబ్రవరి 2వరకు సిబ్బంది ప్రతి ఇంటికెళ్ళి సర్వే చేస్తారన్నారు. బాధితులు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డీపీఎంవో సీతారాముడు, సెహరాజ్ బేగం, వినోద్ కుమార్, అనిల్ సాగర్, మహేష్, హెల్త్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షేమంగా ఆలూరు వాసులు

ఆలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళాలో జరిగిన అగ్నిప్రమాదం నుంచి ఆలూరుకు చెందిన రవి, వన్నూర్, వినోద్ కుమార్ తృటిలో తప్పించుకున్నారు. ఈనెల 16న కుంభ మేళాకు బయలుదేరిన వీరు 18న ప్రయోగ రాజ్ త్రివేణి సంగమానికి చేరుకొని పుణ్య స్నానాలు చేసి, అక్కడే బస చేశారు. ఆదివారం తెల్లవారు జాము న షెడ్లలో అగ్ని ప్రమాదం సంభవించిందని, సురక్షితంగా బయట పడ్డామన్నారు.

రీసర్వేతో రైతులకు న్యాయం

తుగ్గలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న రీసర్వేలో రైతులకు న్యాయం జరుగుతుందని డీటీ నాగరాజు, టీడీపీ నాయకుడు ఈశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పగిడిరాయిలో రెండో విడత భూసర్వేను ప్రారంభిచారు. సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు నయోమి, నాగేంద్ర, రెహిమాన్, రంగప్ప, రైతులు డీలర్ సుంకన్న, తదితరులు ఉన్నారు.

టీబీని ప్రారంభంలో గుర్తించాలి

ఆదోని టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : టీబీని ప్రారంభంలోనే గుర్తించి, మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని వైద్యులు రేణు శ్రీ, అరుణ్ సాగర్, వినోద్ కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని అరుంధతి నగర్, హనుమాన్ నగర్, షరాఫ్ బజార్ ప్రాంతాలల్లో టీబీ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. బాధితులు ఆరు నెలలు ఉచితంగా మందులు ఇస్తామన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఆలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అరికేర గ్రామంలో నిర్మించిన మాల మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. వచ్చే నెల 2న ఆలయ ప్రారంబోత్సవానికి కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

అక్షరాస్యత శాతాన్ని పెంచాలి

దేవనకొండ,జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంతో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఎంపీడీవో గౌరిదేవి, వెలుగు ఏపీఎం నర్సన్న అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. .సూపర్‌వైజర్ ఫయాజ్, సీసీలు ప్రభాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు, ఉపాధి కల్పిస్తాం

ఆదోని రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కూలీలు వలస వెళ్లొద్దని, ఉపాధి కల్పిస్తామని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఏపీవో సూర్య ప్రకాష్ కోరారు. సోమవారం జి.హోసళ్లి గ్రామంలో సచివాలయ, ఉపాధి సిబ్బందితో కలిసి గ్రామస్థులతో మాట్లాడారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని గిట్టుబాటు కూలీ అందేలా చూస్తామన్నారు. మండలంలో రోజు4,700మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారని, అవినీతికి పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే

మద్దికెర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్దికెరకు మంగళవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వస్తున్నారని సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్ తెలిపారు. పంచాయతీ నిధులతో నిర్మించిన 26 షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తారరన్నారు. సోమవారం తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

ఆలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్, హెల్పర్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థులు దరఖాసు చేసుకోవాలని ు సీడీపీవో కేవీ బాలమణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేయడం తగదు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో భాగమైన ఎంఈవో వ్యవస్థను క్లస్టర్ల పేరుతో నిర్వీర్యం చేయడం తగదని ఎస్టీయూ కౌన్సిలర్ మహాదేవప్ప, కమిటీ సభ్యుడు రామాంజినేయులు అన్నారు. సోమవారం ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని కౌతాళం మండల నాయకుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు పర్యవేక్షించడానికి క్లస్టర్ల ఏర్పాటుకు అధికారులు పాఠశాలను మ్యాపింగ్ చేస్తుండటంతో హెచ్ఎంలపై పనిభారం పెరుగతుందన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, నాయకులు రామకృష్ణ, సుధాకర్ బాబు, రాము, వెంకటేశ్వర్లు, గణేష్ పాల్గొన్నారు.

తప్పులను సరిచేస్తాం

దేవనకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత రీసర్వేలో తప్పులను సరిచేస్తామని డీటీ అమీనా బేగం, సర్వేయర్ మేఘశ్యామ్ అన్నారు. మండలంలోని కరివేముల గ్రామంలో రీసర్వే చేస్తున్నామన్నారు.

ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వాలి

మద్దికెర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని ఎంపీపీ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు కాల్వ రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారుప. సోమవారం ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. నిధుల వివరాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. సర్పంచ్ సుహాసిని పాల్గొన్నారు.

మద్దతు ధర ఇవ్వాలి

పత్తికొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో రైతన్న డైరీని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం లేదని, మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని, దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమం చేస్తున్నారన్నారు. భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్, తిమ్మయ్య పాల్గొన్నారు.

ఆలూరు ఇన్‌చార్జిని ప్రకటించాలి



మాట్లాడుతున్న బొజ్జమ్మ

దేవనకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి ఎవరో అధినాయకత్వం ప్రకటించాలని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, వైకుంఠం శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ వర్గ రాజకీయాలతో కార్యకర్తలకు పనులు కావడం లేదని దీంతో వారు నలిగిపోతున్నారన్నారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు మాత్రం తామే నాయకులంటూ చెలమణి చేస్తున్నారని నియోజకవర్గంలో కొంతమంది వర్గాలను ప్రోత్సహిస్తూ, దేవనకొండలో మరో టీడీపీ కార్యాలయాన్ని పెట్టారన్నానరు. అధినాయకత్వమే ఇన్‌చార్జి పేరును ప్రకటించాలన్నారు. కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, ఉచ్చీరప్ప, మల్లయ్య, శేఖర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాలు



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

వెల్దుర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం, వెల్దుర్తి గ్రామాల్లో సోమవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. నట్టల నివారణ మందు తాపించి, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి, నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు అందజేశారు. పశువైద్యాధికారులు శాంతలత, స్వాతి పాల్గొన్నారు.

దళారులను ఉపేక్షించం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారులను ఉపేక్షించమని ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరించారు. సోమవారం కార్యాలయానికి వెళ్ళి సబ్ రిజిస్టర్ అరుణ్ కుమార్‌తో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు మారారని, రోజుకు వందకు క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్ చేస్తున్నారని రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు, పేర్ల మార్పును సహించమని హెచ్చరించారు. నిబంధనల మేరకే చలానా మాత్రమే కట్టాలని ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వొద్దన్నారు. లంచం అడిగితే 1064 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సర్వేయర్‌ను నియమించాలి

ఆలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దహోత్తూరు గ్రామానికి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని సీపీఎం కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వేయర్ లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కృష్ణ, నాగరాజు, డీవైఎఫ్ఐ కార్యదర్శి షైన, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి గిరి మూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌డేలో అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. తనకు సర్వే నెం.428/ఏ2లో 2 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో, 1.44 ఎకరాలే ఉందని, మొత్తం భూమిని ఆన్‌లైన్ చేయాలని పెద్దక డబూరు మండలానికి చెందిన రామకృష్ణ అర్జీ సమర్పించారు.

2. ఆదోని పట్టణం 41వ వార్డులో ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ 80 అండుగుల రోడ్డు ఉండగా 40 అడుగులు ఆక్రమణకు గురైందని, తొలగించాలని పట్టణానికి చెందిన గౌస్ అర్జీ సమర్పించుకున్నారు.

3. తన కుమారుడు సాయి తేజ(14) దివ్యాంగుల పింఛన్ వస్తుందని, మంచానికే మరిమితమయ్యాడని, అదనపు పింఛన్ మంజూరు చేయాలని ఆదోని పట్టణానికి చెందని లక్ష్మి అర్జీ ఇచ్చారు.

4. ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీ ఐదో రోడ్‌లో 33 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురై, 15 అడుగులకు ఉందని, తొలగించాలని పట్టణానికి చెందిన రాఘవేంద్ర అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వరులు, షఫీవుల్లా, ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫీ, పాల్గొన్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు


నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. పుష్యమాసం సోమవారం షష్ఠి పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాలు భక్తుల హర్షధ్వనాలు మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి భక్తులకు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

వైభవంగా నరహరి తీర్థుల పూర్వారాధన

మంత్రాలయం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురువులైన మధ్వాచార్యుల ప్రథమ శిష్యులైన నరహరి తీర్థుల పూర్వారాధన వైభవంగా నిర్వహించారు. సోమవారం కర్ణాటకలోని హంపి సమీపంలో తుంగభద్ర నదిలో వెలసిన నరహరి తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మొదటి పూర్వారాధన కార్యక్రమం పండితులు, అర్చకులు శ్రీమఠం శిష్యులు పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. నరహరితీర్థుల జీవిత ఘట్టాలను ఉపన్యాసం ద్వారా భక్తులకు వినిపించారు. తీర్థప్రసాదాలు భక్తులకు అందజేసి ఉచిత అన్నదానం నిర్వహించారు. పూర్వారాధన మహోత్సవాల్లో భక్తులకు శేషవస్త్రం, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

25లోగా ఫీజు చెల్లించాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఈనెల 25లోగా చెల్లించాలని కోఆర్డినేటర్ బాలరాముడు సోమవారం తెలిపారు. డిగ్రీ బీఏ, బీకం, బీఎస్సీ పరిధిలో మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈనెల 25లోగా, 1వ సెమిస్టర్, 3, 5వ సెమిస్టర్స్ విద్యార్థులు 30వ తేదీలోపు చెల్లించాలన్నారు. విద్యార్థుల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

మంత్రాలయం జనవరి 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కౌతాళం మండలంలో కుంతనహాల్-2, మరళి, పెద్దకడుబూరులోని గంగులపాడులో 1, కోసిగిలో అగసనూరులో 1, మొత్తం నాలుగు కార్యకర్తల పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆయా పోస్టులకు కౌతాళం మండలంలో సులకేరి, ఈర్లదిన్నె, మరళి, నడిచాగి-2 మంత్రాలయం మండలంలో కాచాపురం, నారాయణపురం, కోసిగి మండలంలో కోసిగి- 15, సాతనూరు, పల్లెపాడు, వందగల్లు, పెద్దకడుబూరు మండలంలో నౌవనేకల్, చిన్నతుంబళం-4 సెంటర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 10వ తరగతి ఉత్తీర్ణులై 21 సం వత్సరాలు నిండి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థి వివాహితురాలై స్థానిక నివాసం ఉండాలన్నారు. ఈ నెల 28వతేదీలోపు మంత్రాలయం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీడీపీలో చేరిక



వైసీపీ కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు అడివప్ప, రఘు, రజాక్, వలిసాబ్, హనుమంతులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సొంత గ్రామమైన మాధవరంలో టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, వీరనాగుడు, రవికుమార్, వీరేష్, చిన్నభీమేష్, సి.వీరనాగుడుతో పాటు రామకృష్ణ, దాదాపు 20 కుటుంబాలు టీడీపీలో చేరారు.

మతతత్వ భావజాలంపై పోరాడాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మతతత్వ భావజాలంపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాధాకృష్ణ అన్నారు. సీపీఎం 23వ జిల్లా మహాసభలు విజయవంతం కావడంపై అభినందన సభ సోమవారం పట్టణ కార్యదర్శి పి. గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లౌకిక వాదాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చేందిందని ఆరోపించారు. వెంకటేశ్వర్లు, ఆనంద్‌బాబు, యు.రమేష్, ఖాజా, రాముడు, కృష్ణ, గోవర్ధనమ్మ, శివలక్ష్మి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజరాజేశ్వరి నగర్‌లో జరిగిన చోరీ కేసులో నిందితుడు నిరంజన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 17న గౌతమి అనే మహిళ తన ఇంటికి తాళం వేయకుండా డోర్ మాత్రమే వేసి కింద ఉన్న పార్కింగ్ ఏరియాలో పిల్లలను ఆడించుకుంటూ ఉంది. నిందితుడు చాకచక్యంగా ఆమె ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు నగలు చోరీ చేశారు. సీసీ కెమెరాల ఆదారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామమంతా ఖాళీ

• ఒకే రోజు వంద కుటుంబాలు వలస
• స్థానికంగా పనులు లేకపోవడమే కారణమంటూ ఆవేదన


మాధవరంలో వలస వెళ్లేందుకు వాహనం ఎక్కుతున్న కూలీలు

మంత్రాలయం జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామమంతా వలసవెళ్లిపోవడంతో గ్రామమంతా ఖాళీ అయింది. సోమవారం రాత్రి ఒక్కరోజే దాదాపు వంద కుటుంబాలు పది వాహనాల్లో మూట ముళ్లె సర్దుకుని ప్రైవేట్ వాహనాల్లో గుంటూరు, వినుకొండకు వలస వెళ్లారు. రెండు రోజులుగా దాదాపు తొమ్మిది వాహనాల్లో వలస వెళ్లగా.. సోమవారం ఎస్సీ, బీసీ కుటుంబాలు వృద్ధులను ఇంటి దగ్గరే ఉంచి తమ పిల్లలను వెంట పెట్టుకుని వలస వెళ్లిపోయారు. అదే విధంగా రచ్చుమర్రిలో రెండు రోజులుగా 12 వాహనాలు, చిలకలడోన నుంచి ఎనిమిది వాహనాల్లో, సూగూరు నుంచి మూడు వాహనాలు వలసబాట పట్టారు. గ్రామాల్లో పనుల్లేక పోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో వలస వెళ్లి బతుకుజీవుడా అంటూ జీవనంసాగించాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు మాత్రం వలసల నివారణ కోసం తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నా.. వ్యవసాయ కూలీలకు భరోసా కల్పించకపోవడంతోనే వలసబాట పడుతున్నారు.

పెన్షనర్లకు తీరని అన్యాయం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు తీరని అన్యాయం చేసిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపంలో పెన్షనర్ల సంఘం ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఏపీ వీరన్న అధ్యక్షతన పెన్షనర్ల సంఘం రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ఈ సభలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న సంఘ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సభలో ఆయా జిల్లాల నుండి వచ్చిన పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తమ సమస్యలను వివరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రెస్టోరేషన్‌ను నిలిపివేసిందన్నారు. ఈ విధానాన్ని తిరిగి పునరుద్ధరించేలా చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన మెడికల్ రీయంబర్స్ మెంట్, డీఏ బకాయిలు మంజూరు చేయిస్తామన్నారు. నూతన పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, వెంటనే ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు వందకు వందశాతం హెల్త్‌కార్డులు వచ్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో పెన్షనర్ల సమస్యలన్ని పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు జీ.ఎస్ అబ్దుల్‌కరీం, జనరల్ సెక్రటరీ ప్రభుదాసు, ఆర్గనైజర్ పెద్దన్నగౌడు, కోశాధికారి శర్మ, కర్నూలు జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంగళరెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు మద్దిలేటి రెడ్డి, ఎస్‌టీవో యం.రాజు, శ్రీనివాసులు, పోలకంతయ్య, సుందరీబాయి, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతు అభివృద్ధి


రీసర్వేను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు అడివప్పగౌడ్

కౌతాళం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో సోమవారం భూముల రీసర్వేను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గోపాల్, మహదేవ, రేనప్ప, గుడిసిలి గోపాల్ ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని కడిమెట్ల గ్రామంలో సర్వే అధికారులు రీ సర్వేను సోమవారం తహసీల్దార్ శేషఫణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, రీ సర్వే డీటీ జ్యోతీర్మయి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నందవరం: రీ సర్వేతో ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దారు మహేష్ అన్నారు. సోమవారం నందవరంలోని నదికైరవాడి గ్రామంలో రీ సర్వే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఐ టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కురవ వీరేష్, డీలర్‌బజారి, వీరారెడ్డి, సర్వేయర్లు మల్లికార్జునగౌడు, మాధవి, అశ్విని, సోనియా సుల్తాన్, వీఆర్వోలు రాఘవేంద్ర, చిన్న కొండన్న, రంగస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.


కడిమెట్లలో భూ రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కౌతాళం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కౌతాళం వైద్యాధికారి డాక్టర్ కిరణ్ ఆకాంక్షించారు. కౌతాళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో డాక్టర్ కిరణ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు సాయివర్మ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని బూదూరు గ్రామంలో సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలు, మహిళ హక్కులు, పొలం తగాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్, ఆన్‌లైన్ మోసాలు, కర్ణాటక మద్యం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలకు ఎవరూ బలికావద్దన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, సోమశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్


విజేత జట్లకు షీల్డ్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నదికైరవాడి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బీవీ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. విజేతగా నిలిచిన ఎమ్మిగనూరు శిల్పా హస్పిటల్ జట్టు కు రూ. 15116లను ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కురవవీరేష్, అలాగే రన్నర్‌గా గెలుపొందిన నదికైరవాడి 11 లైన్స్ జట్టు రూ. 10116లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదిశేష, మహబూబ్‌బాష, వీరారెడ్డిలు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, లాల్‌ప్రకాష్‌రెడ్డి, సుధాకర్, మంజు, విక్రమ్, విజయ్, శివ పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కోడుమూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో ఫ్యూజన్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ సంస్థ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. 18-30 ఏళ్లలోపు డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు విద్యార్హత ప్రతులు, బయోడెటాతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

జాతరలో నోరూరిస్తున్న బెండ్లు.. బతాసులు

• కిటకిటలాడుతున్న మిఠాయి దుకాణాలు

ఎమ్మిగనూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతర అనగానే మనకు గుర్తుకు వచ్చేది.. మన పిల్లలు ఎదురు చూసేది మిఠాయిలు, బెండు, బతాసులు, బురుగులు, కారాలు. ఏ జాతరకు వెళ్లిన ఇవి తప్పనిసరిగా ఇంటికి తీసుకెళ్లడం ఆనవాయితీ. మారుతున్న కాలంతో పాటు కొన్ని రకాల మిఠాయిలు సైతం నేడు కనుమరుగవుతూ వస్తున్నాయి. అయితే ఎమ్మిగనూరు జాతరలో మాత్రం కనుమరుగవుతున్న బెండు, బతాసులు మాత్రం మనకు దర్శనమిస్తున్నాయి. వీటిని చూస్తే.. నూరూరక తప్పటం లేదు. జాతరకు వచ్చిన ప్రతిఒక్కరు ఒకటో రెండో నోట్లో వేసుకొంటు తీపిని ఆశ్వాదిస్తున్నారు. దుకాణాల దగ్గర పెద్ద ఎత్తున మిఠాయిలను కొనుగోలు చేస్తుండటంతో కిక్కిరిసి కనిపించాయి. ఇంటికి వెళ్తూ..వెళ్తూ.. చివరలో చెరకులను సైతం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.


జాతరలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బెండ్లు


జాతరలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిఠాయిలు

జాతరలో ప్రత్యేకం... పసుపు కుంకుమలు

ఎమ్మిగనూరు జాతర అనగానే ఆడపడుచులకు గుర్తుకువచ్చేది పసుపు, కుంకుమ. అటుతరువాత గాజులు. జాతరకు వచ్చే తమ బంధువులకు, ఆడపడుచులకు ఎమ్మిగనూరు పట్టణ వాసులే గాక చుట్టు ముట్టు గ్రామాల ప్రజలు తమ వారిని జాతరలోకి పిలుచుకొచ్చి తేరుబజారులో పసుపు, కుంకుమలను కొనిచ్చి.. సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. జాతరలో ధర్మవరం కుంకుమ, కదిరి కుంకుమ, మహారాష్ట్ర, కుంకుమ, అనంతపురం కుంకుమలను వ్యాపారులు అమ్మకాలకు ఉంచారు. తేరుబజారులోని జాతరలో పసుపు, కుంకుమ అమ్మే అంగళ్లు ఆడపడుచులతో కిటకిటలాడాయి. అలాగే తమ పూజ కోసం విభూతి పండ్లు కొనుగోలు చేయడం కనిపించింది. అనాధిగా ఎమ్మిగనూరు జాతరలో వస్తున్న సాంప్రదాయాలను ప్రజలు ఇప్పటికీ కొనిసాగుస్తూ వస్తుండటం విశేషం.

ఉపాధి పనులు కల్పిస్తాం


ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దకడుబూరు , జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉపాధి పనులు కల్పిస్తాము.. వలసలు వెళ్లొద్దని ఎంపీడీవో జయరాముడు, ఏపీవో ఖాదర్ బాషా అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్లుకుంట, పీకలబెట్ట, మేకడోణ, ముచ్చిగిరి గ్రామాల్లో ఉపాధి పనులుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. కొలతలు ప్రకారం పనులు చేస్తే రూ. 300 వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పశువుల మందులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

కౌతాళం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి జగదీష్ బాబు, కామవరం పశు వైద్యాధికారి మహేశ్వరి కోరారు. సోమవారం కౌతాళం, కామవరం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, కౌతాళం టౌన్ టీడీపీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్, గ్రామర సర్పంచ్ పాల్‌దినకరన్, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, నాయకులు సతీష్‌నాయుడు, రాజబాబు, సిద్దు, సుబ్రమణ్యంరాజు, రాజానందు జనసేనా నాయకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు

పెద్దకడుబూరు , జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలోని ఆదోని- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో చోటు చేసుకుంది. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుల్బార్గకు చెందిన వారు కారులో ఎమ్మిగనూరు నుంచి బెంగళూరుకు బయలుదేరారు. మహారాష్ట్రకు చెందిన మినీ లారీ ఆదోని నుంచి వేగంగా రావటంతో ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాయచూరు ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ముగ్గురు మహిళల అరెస్టు

ఎమ్మిగనూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు నందవరం మండలం గంగవరం దగ్గర దాడిచేసి పట్టుకున్నారు. సోమవారం ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదోని పట్టణానికి చెందిన బోయ ఈరమ్మ, బోయ హనుమంతమ్మ, బోయ మానస కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా గంగవరం క్రాస్ దగ్గర దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 30వేలు విలువ చేసే 720 ఒరిజినల్ చాయిస్ కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. దాడుల్లో ఎస్ఐ ఇస్మాయిల్, గోపాల్, కానిస్టేబుళ్లు కరుణాకర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామసమీపంలో అదే గ్రామానికి చెందిన చాగి రమేష్ తన ఇంట్లో దాచిన 960 అక్రమ కర్ణాటక మద్యం 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విక్సీ టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్‌లు సోమవారం తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, కిషోర్ కుమార్, మునిరంగడు, భరత్, రవికుమార్ ఉన్నారు.



నందవరం, కోసిగిలో పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు